సమాచారం

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు(కిలోల్లో).. టమోటా రూ.23, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 55, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 35, పందిరిబీర 45, క్యాబేజీ 9, క్యారెట్ 15, దొండ 23, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 40, గోకరకాయ 45, కీర 25, దోసకాయ 28, బీట్‌రూట్ 16, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 19, చామగడ్డ 70, మొరంగడ్డ 23, కందగడ్డ 33, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9(ఒకటి), మునగకాయ 4–6, ముల్లంగి 3–5.

రేపు ఉచిత వైద్య శిబిరం

చిలకలగూడ: సీతాఫల్‌మండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈఎన్‌టీ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. నోవా ఈఎన్‌టీ ఆస్పత్రి సహకారంతో నిర్వహించే ఈ శిబిరంలో నిష్ణాతులైన వైద్యులు చెవి, గొంతు, ముక్కు రుగ్మతలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. ఈ అవకాశానిన్ ప్రజలు వినియోగించుకోవాలని, పరీక్షల కోసం వచ్చే సమయంలో ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ తీసుకురావాలని సూచించారు.

నేడు కాంగ్రెస్ 'హాత్ సే హాత్ జోడో' యాత్ర

బన్సీలాల్‌పేట్: కాంగ్రెస్ పార్టీ హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా శనివారం సికింద్రాబాద్ మహంకాళి దేవాలయం నుంచి పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు డి.నాగేందర్(రాజప్ప) శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుందని, మహంకాళి ఆలయం నుంచి పాన్‌బజార్, కుర్మబస్తీ, సుభాష్ రోడ్డు, విక్టోరియాగంజ్, రాణిగంజ్ మీదుగా సాగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

సెయింట్ జాన్స్ పీజీ కళాశాల స్నాతకోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని సెయింట్ జాన్స్ పీజీ కళాశాల స్నాతకోత్సవం శుక్రవారం నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి బిషప్ రైట్. రెవరెండ్ డాక్టర్ జాన్ గొల్లపల్లి అధ్యక్షత వహించగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన 2020–2022 బ్యాచ్ పీజీ విద్యార్థులకు పట్టాలు అందజేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ వేణు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సామగ్రి గోదాంలో అగ్ని ప్రమాదం

సనత్‌నగర్: ప్లాస్టిక్ సామగ్రి గోదాంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న ఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఎర్రగడ్డ నుంచి మోతీనగర్ వెళ్లే రహదారిలో గ్లోబల్ సేల్స్ కార్పొరేషన్ గోదాంలో దట్టమైన పొగలు రావడంతో పాటు మంటలు ఎగిసిపడడంతో సెక్యూరిటీ సిబ్బంది యజమానికి సమాచారం ఇచ్చారు. ఆయన ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సనత్‌నగర్ ఫైర్ ఆఫీసర్ ప్రదీప్ సిబ్బందితో అక్కడికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే మంటలు ఎక్కువ కావడంతో అన్నపూర్ణ ఔట్‌పోస్ట్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, సికింద్రాబాద్‌ల నుంచి ఫైరింజన్లను రప్పించి దాదాపు నాలుగు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం సంభవించి ఉంటుందని అగ్నిమాపక శాఖ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. దాదాపు 5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని తెలిపారు. ఘటన ప్రాంతాన్ని అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి మధుసూదన్‌రావుతో పాటు సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్, ఎస్‌ఐ మురళీగౌడ్ సందర్శించి వివరాలు సేకరించారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించే టెక్నో ఉస్మానియా 2023 వాల్ పోస్టర్‌ను శుక్రవారం విద్యార్థులతో కలిసి ప్రిన్సిపాల్ ప్రొ.చింత సాయిలు ఆవిష్కరించారు. విద్యార్థుల ఆధ్వర్యంలో ఏప్రిల్ 25న ప్రారంభమయ్యే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా వివిధ కాలేజీలకు చెందిన విద్యార్థులు వస్తారని కన్వీనర్ డాక్టర్ జ్యోతి, కో కన్వీనర్ డాక్టర్ పరశురామ్ తెలిపారు.

ప్రింటర్స్ డే నిర్వహణ

రాంగోపాల్‌పేట్: మక్తల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రింటర్స్ డే నిర్వహించారు. ప్రింటింగ్ యంత్రాన్ని కనుగొన్న జోహెన్నెస్ గూటన్‌బర్గ్ జయంతి సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జలంధర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రింటర్స్ డే నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రింటింగ్ రంగ కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. కాలగర్భంలో కలిసిపోయే ఎన్నో తాళపత్ర గ్రంథాలను, ఇతిహాసాలను అక్షర రూపంలో ముద్రించి భావితరాలకు అందించేందుకు ప్రింటింగ్ యంత్రం ఉపయోగపడుతుందన్నారు.

కంటోన్మెంట్‌పై 'మర్రి' పట్టు

బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జ్ స్థాయిలో పనిచేస్తున్న రాజశేఖర్ రెడ్డి

- బోర్డు ఎన్నికల్లో పార్టీ మద్దతుదారుల గెలుపు కోసం రంగంలోకి దిగిన మర్రి
- ఆశావహులు, కీలక నేతలతో వరుస సమావేశాలు
- శ్రీగణేశ్, గొల్ల కిట్టు, శ్రవణ్ వంటి కీలక నేతల మద్దతు కోసం ప్రయత్నాలు ముమ్మరం


కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఎన్నికల ప్రకటన వెలువడిన తర్వాతి రోజే స్థానిక ఎమ్మెల్యే సాయన్న మృతితో బీఆర్‌ఎస్‌కు పెద్ద దిక్కు కరువైంది. దీంతో సాయన్న ఉన్నప్పుడే నియోజకవర్గంలో మరో పవర్ సెంటర్‌గా కొనసాగిన మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి ఇక్కడ అనధికారిక ఇన్‌చార్జ్‌గా మారారు. పార్టీలోని తాజా మాజీ బోర్డు సభ్యులంతా మర్రి కనుసన్నల్లో మెలుగుతూ వస్తున్నారు. ఇటీవల నిర్వహించిన ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా వారంతా మర్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లోనే పాల్గొన్నారు. ఈ క్రమంలో బోర్డు ఎన్నికల ప్రకటనతో మర్రి మరింత క్రియాశీలకంగా మారారు. బోర్డు ఎన్నికల్లో తమ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఆయన పార్టీకి దూరంగా ఉంటున్న అసంతృప్త నేతలను బుజ్జగించే పనిలో పడ్డారు.

రాజశేఖర్‌రెడ్డి సూచనలు పాటిస్తా: శ్రీగణేశ్

2018 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన శ్రీగణేశ్ 2019 పార్లమెంట్ ఎన్నికల్లో మర్రి రాజశేఖర్‌రెడ్డికి మద్దతుగా నిలిచి బీఆర్‌ఎస్‌లో చేరారు. కొంతకాలం పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్న ఆయన వర్గపోరుతో స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారు. శ్రీగణేశ్ ఫౌండేషన్ పేరిట సొంతంగానే నియోజకవర్గంలో ముమ్మరంగా తిరుగుతున్నారు. సొంతంగా క్యాడర్‌ను ఏర్పాటు చేసుకున్న ఆయన ఎమ్మెల్యే సీటు కోసం పోటీ పడుతున్నారు. అన్ని వార్డుల్లోనూ బలమైన కార్యకర్తలు ఉన్న ఆయన మద్దతు కోసం మర్రి ప్రయత్నాలు మొదలుపెట్టారు. అందులో భాగంగానే శుక్రవారం శ్రీగణేశ్‌తో ప్రత్యేకంగా సమావేశమై పార్టీ మద్దతుదారుల గెలుపు కోసం పనిచేయాల్సిందిగా కోరారు. ఇందుకు శ్రీగణేశ్ సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. గతంలో పార్లమెంట్ ఎన్నికల్లో మర్రి పిలుపు మేరకే పార్టీలోకి వచ్చిన తాను ఆయన సూచనలు పాటిస్తానని ప్రకటించారు.

కీలక నాయకులతో సమావేశం

మర్రి రాజశేఖర్ రెడ్డి రెండు రోజులుగా పలువురు కీలక నేతలతో సమావేశం అవుతున్నారు. మారేడుపల్లి ప్రాంతానికి చెందిన కీలక నేత గొల్ల కిట్టు (చిరబోయిన కృష్ణయాదవ్), బీజేపీలో క్రియాశీలకంగా కొనసాగుతున్న గడ్డం శ్రవణ్ యాదవ్‌లతో మర్రి సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

- మారేడుపల్లిలో గట్టి పట్టున్న గొల్ల కిట్టుతో పాటు శ్రవణ్‌యాదవ్ బుధవారం బోయిన్‌పల్లిలో మర్రి రాజశేఖర్ రెడ్డితో సమావేశమయ్యారు. గతంలో మారేడుపల్లి మాజీ కార్పొరేటర్‌గా తన సోదరిని గెలిపించుకున్న కిట్టు మద్దతు ఉంటే కంటోన్మెంట్ 4, 5 వార్డుల్లో అభ్యర్థుల గెలుపు నల్లేరుపై నడకే అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో రామకృష్ణ ఐదో వార్డు నుంచి ఇండిపెండెంట్‌గా గెలవడంలో కిట్టు పాత్ర కీలకం అని రామకృష్ణ సైతం పలుమార్లు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఎన్నికల్లో కిట్టు కుటుంబీకులు రామకృష్ణపై పోటీకి సిద్ధమవుతుండడం గమనార్హం. అదే సమయంలో ఓటర్ మేనేజ్‌మెంట్, పొలిటికల్ విశ్లేషణలో కీలకంగా పనిచేస్తున్న భారత్ అనలిటికా వ్యవస్థాపకుడు శ్రవణ్‌యాదవ్ సైతం నాలుగో వార్డు నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో బీజేపీలో కొనసాగిన ఈయన ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది.


మర్రి రాజశేఖర్ రెడ్డి


శ్రీగణేశ్


గొల్ల కిట్టు


శ్రవణ్‌యాదవ్

స్వచ్ఛతపై విద్యార్థుల అవగాహన ర్యాలీ


విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్

చిలకలగూడ: విద్యార్థులంతా భాగస్వాములై స్వచ్ఛ భారత్‌ను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ కోరారు. సీతాఫల్‌మండి పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలు తమ పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. వీధికుక్కల విషయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇప్పటికే జీహెచ్‌ఎంసీ సిబ్బంది అవసరమైన చర్యలు చేపట్టారన్నారు. వేసవికాలం మొదలైన నేపథ్యంలో కాచి వడపోసిన నీరు తాగాలని, కాటన్ దుస్తులు ధరించాలని ఆమె సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి స్వచ్ఛభారత్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, బీఆర్‌ఎస్ నాయకులు కరాటే రాజు, రవి, ప్రవల్లిక, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడిగా నాగేశ్వరరావు



చిలకలగూడ: దక్షిణ మధ్య రైల్వే జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా సికింద్రాబాద్‌కు చెందిన అఖిల భారత దివ్యాంగుల హక్కుల సంఘం జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు ఎంపికయ్యారు. ఈ మేరకు డిప్యూటీ జనరల్ మేనేజర్ ముత్యాల నాయుడు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. రెండు దశాబ్దాలుగా దివ్యాంగుల హక్కుల కోసం పోరాడుతున్న నాగేశ్వరరావుకు గతంలో కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ సభ్యుడిగా, పలు కేంద్ర ప్రభుత్వ కమిటీల్లో రాష్ట్ర సభ్యుడిగా పనిచేసిన అనుభవం ఉంది. ఆయన 2025 జనవరి 31 వరకు పదవిలో కొనసాగుతారు. రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు.

తార్నాకలో వీధి కుక్కల బెడద

లాలాపేట: తార్నాక డివిజన్‌లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. లాలాపేట ఇందిరానగర్, తార్నాక కాలనీ వీధుల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. లాలాపేట వినోభానగర్‌లో ఓ చిన్నారి కుక్క కాటుకు గురైన ఘటనలు గతంలో చోటుచేసుకుంది. దీంతో ఆ వీధుల నుంచి ప్రజలు ఒంటరిగా, ద్విచక్ర వాహనంపై వెళ్లలేకపోతున్నారు. కుక్కలతో పాటు కోతులు సైతం తార్నాక వాసులను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. బాల్కనీల్లో, ఇంటిపైన చేరి హంగామా చేస్తున్నాయి. ఇటీవల అంబర్‌పేటలో చోటుచేసుకున్న హృదయవిదారక ఘటన మరోసారి పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



'బీఆర్‌ఎస్ పాలనలో అప్పుల రాష్ట్రంగా తెలంగాణ'


సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ అప్పుల రాష్ట్రంగా మారి ప్రజలు అథోగతి పాలవుతున్నారని పలువురు వక్తలు అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడలో బీజేపీ నాయకుడు ఆనంద్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ప్రజా గోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం సమన్వయకర్త టి.రాజశేఖరరెడ్డి, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతో మంది ఆత్మబలిదానాలు, పోరాటాల ఫలితంగా సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబ పాలన సాగుతుందని మండిపడ్డారు. తెలంగాణలో మద్యం ఏరులై పారుతుందని, ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగ యువత, పేద మధ్య తరగతి వర్గాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సమాజంలో అన్ని వర్గాలకు హామీ ఇచ్చి మోసం చేసిన ఘనత బీఆర్‌ఎస్‌కు దక్కుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. తెలంగాణలో బీజేపీ అధికారం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని వారు కోరారు.

రైల్వే కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి


రైల్ నిలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

అడ్డగుట్ట: రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.18,486 ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఉపాధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైల్వే ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అమ్మేస్తుందన్నారు. రైల్వే ఉద్యోగులకు నేషనల్ పెన్షన్ స్కీమ్ 2004ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదే విధంగా రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు కనీస వేతనాలతో పాటు ప్రతినెలా 7వ తేదీన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బి.మధు, వెంకటేష్, కుమారస్వామి, అజయ్‌బాబు, మోహన్, శాంతులుగౌడ్, ఈదమ్మ, గీత, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో నాలుగేళ్ల డిగ్రీ కోర్సులకు ప్రతిపాదనలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో 4 ఏళ్ల బీఎస్సీ డ్యూయల్ డిగ్రీ కోర్సు ప్రవేశపెట్టేందుకు మెల్‌బోర్న్ వర్సిటీల ప్రతినిధులతో శుక్రవారం యూనివర్సిటీ అధికారులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో 2024–25 విద్యా సంవత్సరం నుంచి ఓయూలో బీఎస్సీ డ్యూయల్ డిగ్రీ కోర్సు ప్రవేశపెట్టాలని మెల్‌బోర్న్ యూనివర్సిటీ అంతర్జాతీయ అసిస్టెంట్ డిప్యూటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ.అశోక్ ముత్తుపాండియన్ ప్రతిపాదించారు. నూతన డిగ్రీ కోర్సుల ప్రతిపాదనల పట్ల ఓయూ వీసీ ప్రొ.రవిందర్ సంతోషం వ్యక్తం చేశారు. ఓయూ తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని ఉన్నత విద్యాశాఖ అధికారి నవీన్ మిట్టల్ ప్రశంసించారు.

బాలికల ఆత్మరక్షణకు కరాటే దోహదం

పద్మారావునగర్: బాలికల ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం అని పలువురు వక్తలు అన్నారు. భోలక్‌పూర్ మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నెల రోజుల పాటు నిర్వహించిన కరాటే పోటీల ముగింపు కార్యక్రమం శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. నెల రోజుల పాటు నేర్చుకున్న కరాటే మెలుకువలను ఈ సందర్భంగా బాలికలు ప్రదర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రెడ్డి, కరాటే కోచ్ నర్సింగ్ మాట్లాడుతూ.. ఆడపిల్లలను తమను తాము రక్షించుకోవడానికి కరాటే దోహదపడుతుందన్నారు. నేర్చుకున్న విద్యను ఆచరణలో పెట్టాలన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ సమర్థత చాటుకోవాలని వారు సూచించారు.




ఓయూ భవనాలపై సోలార్ రూఫ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అవసరాలకు సౌర విద్యుత్ తయారీ కోసం భవనాల పై కప్పులపై సోలార్‌రూఫ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు శుక్రవారం అధికారులు తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న పరిపాలన, హాస్టల్ భవనాలతో పాటు ఇతర భవనాలపై సోలార్ రూఫ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఓయూ అవసరాలకు సరిపడా సౌర విద్యుత్ తయారీ చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

తగ్గని దోమల బెడద

- వేసవికాలం ప్రారంభమవుతున్నా తగ్గని దోమల తీవ్రత
- ఎంటమాలజీ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికుల ఆవేదన
- తరచూ దోమల మందు ఫాగింగ్ చేయాలని విజ్ఞప్తి



అడ్డగుట్ట: వేసవి సమీపిస్తున్నా దోమల బెడద తగ్గడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల స్వైర విహారంతో తాము రోగాల బారిన పడుతున్నప్పటికీ ఎంటమాలజీ సిబ్బందికి ఏమాత్రం పట్టడం లేదని మండిపడుతున్నారు. అడ్డగుట్ట ఎ, బి, సి, డి సెక్షన్లు, ఆజాద్ చంద్రశేఖర్ నగర్, మాంగ్‌గారోడియా బస్తీ, బోయ బస్తీ, సాయినగర్, ఇంద్రలక్ష్మి నగర్, లోహియనగర్, కొండారెడ్డినగర్, గడ్డమీది బస్తీ, వడ్డెరబస్తీ, శాస్త్రినగర్, వెంకట్‌నగర్, శాంతినగర్ తదితర బస్తీల్లో దోమల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. దోమల మందు ఫాగింగ్ చేయకపోవడంలోనే దోమల వ్యాప్తి పెరుగుతోందని ప్రజలు వాపోతున్నారు. దట్టమైన చెట్లు ఉన్న ప్రదేశాల్లో, నాలా పరీవాహక ప్రాంతాల్లో తరచూ ఫాగింగ్ నిర్వహిస్తే దోమలు వృద్ధి చెందే అవకాశం తక్కువగా ఉంటుంది. అతిపెద్ద మురికివాడ అయిన అడ్డగుట్టలో వారంలో రెండు మూడు సార్లు ఫాగింగ్ నిర్వహిస్తే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చు. అధికారుల నుంచి ఆదేశాలు ఉన్నప్పటికీ కిందిస్థాయి సిబ్బంది బేఖాతరు చేస్తూ నామమాత్రంగా విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు

అడ్డగుట్టలో నిత్యం డ్రైనేజీ ప్రవాహంతో పాటు నాలాలు, ఖాళీ ప్రదేశాల్లో ఉన్న దట్టమైన పిచ్చి మొక్కల కారణంగా దోమలు స్వైర విహారం చేస్తూ ప్రజలను వ్యాధులకు గురిచేస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం మొండిబండ నగర్‌లో దోమలు కుట్టడంతో 9 నెలల బాలుడు వాంతులు, విరేచనాలతో మృత్యువాత పడ్డాడు. నిత్యం దోమల కారణంగా ఎంతోమంది ప్రజలు మలేరియా, డెంగీ ఇతర ప్రాణాంతకమైన వ్యాధులకు గురవుతున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

దోమల నియంత్రణకు ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకోవడంతో పాటు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. డ్రమ్ములు, కూలర్‌లు, పూల కుండీలు, పాత సామాన్లలో నీళ్లు నిల్వ ఉంటే దోమలు అందులో గుడ్లు పెట్టి వృద్ధి చెందుతాయి. ప్రతీ ఫ్రైడేను డ్రై డేగా పాటించి ఇంటి పరిసరాల్లో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేసుకుంటూ ఉండాలని ఎంటమాలజీ విభాగం అధికారులు సూచిస్తున్నారు.

ఫాగింగ్ చేపడుతున్నాం

ప్రజల సౌకర్యార్థం ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేపడుతున్నాం. నాలా పరీవాహక ప్రాంతాలు, దట్టమైన చెట్లు ఉన్న ప్రాంతాల్లో దోమలు అధికంగా ఉండడంతో వారంలో రెండు రోజులు ఫాగింగ్ చేస్తాం. దోమలు విజృంభించకుండా పూర్తి స్థాయిలో అరికట్టేందుకు కృషి చేస్తున్నాం. ప్రజలు తమ ఇళ్ల ప్రాంగణంలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.

– సునీత, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్

ప్రజలకు నిత్యం ఇబ్బందులు

దోమల కారణంగా ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం వేళ కాసేపు ఇంటి ముందు కూర్చుందామంటే దోమలు చుట్టుముడుతున్నాయి. ప్రజలు రోగాల బారిన పడుతున్నా అధికారులు స్పందించడం లేదు. వారంలో రెండు మూడు సార్లు ఫాగింగ్ చేస్తే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చు.



కె.శ్రీనివాస్, సికింద్రాబాద్ నియోజకవర్గ సీపీఐ కన్వీనర్

కేసీఆర్ పాలన పట్ల ప్రజలు విసిగిపోయారు

బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: ఎన్నికల దగ్గరపడే కొద్దీ కేసీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ఓట్లు దండుకోవాలనే ప్రయత్నాలు చేస్తుంటారని సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి ఆరోపించారు. అప్పుడు ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, కేసీఆర్ పాలన పట్ల ప్రజలు విసిగిపోయి బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం శ్యామలకుంట బస్తీ, జయ ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశాల్లో జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. 2016 జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు ముందు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కటిస్తామంటూ అనేక చోట్ల శంకుస్థాపనలు చేశారన్నారు. సంవత్సరాలు గడిచినా ఇళ్లు పూర్తి కాలేదన్నారు. బస్తీల్లో ఇళ్లను కూల్చి ఉచితంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పారని, వారికి ఇంతవరకు ఇళ్లు ఇవ్వకపోవడంతో అద్దె చెల్లిస్తూ తీవ్రంగా నష్టపోయారన్నారు. నీటి ప్రాజెక్టుల పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆయన ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో అదనంగా ఒక్క ఎకరాకు నీరు అందలేదన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ప్రాజెక్టులు చేపట్టారని, ప్రస్తుతం ఆ భారమంతా ప్రజలపై పడిందన్నారు. నిధులు మళ్లించి ప్రతి రంగాన్ని, ప్రతి వర్గాన్ని మోసం చేసి కేసీఆర్ రికార్డు సృష్టించారని శశిధర్‌రెడ్డి విమర్శించారు. కార్యక్రమంలో శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు మూల రవీందర్, కోటేశ్వరరావు, నాయకులు కన్నూరి క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి జీవిత ఖైదు


షేక్ అల్లావుద్దీన్

సనత్‌నగర్: హత్యాయత్నం కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ నాంపల్లి మూడో సెషన్స్ కోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల మేరకు.. బోరబండలోని ఓ బేకరీలో షేక్ అల్లావుద్దీన్ (40) పనిచేస్తుండగా కొన్ని కారణాలతో యజమాని అతడిని పనినుంచి తొలగించాడు. బేకరీలో పనిచేస్తున్న మరో వ్యక్తి నూమాన్ బిన్ సయీద్ బాబాసాయి (50) వల్లే తనను తొలగించారని అతడిపై కోపం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో 2018, ఏప్రిల్ 12న బేకరీలో ఉన్న నుమాన్ బిన్ సయీద్‌పై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో సయీద్ చేతిపై తీవ్ర గాయమైంది. అడ్డుకున్న మరో వ్యక్తి మహ్మద్ సమీపైనా అల్లావుద్దీన్ కత్తితో దాడి చేయడంతో అతడికి సైతం తీవ్ర గాయాలయ్యాయి. అప్పట్లో అల్లావుద్దీన్‌పై ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో రూ.5 వేల జరిమానాతో పాటు జీవిత ఖైదు విధిస్తూ శుక్రవారం కోర్టు తీర్పు వెలువరించింది.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం


రమేష్

చిలకలగూడ: మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వ్యక్తి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ హరీష్ తెలిపిన వివరాల మేరకు.. చిలకలగూడ సాయిలత ఫంక్షన్ హాల్ ప్రాంతానికి చెందిన సాయం రమేష్ (55)కు కొన్ని రోజుల నుంచి మతిస్థిమితం సరిగా ఉండడం లేదు. అతడు ఈ నెల 16న బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. పలు ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో అతడి సోదరి శోభ శుక్రవారం పోలీసులను ఆశ్రయించింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, రమేష్ ఆచూకి తెలిస్తే చిలకలగూడ ఠాణాలో సమాచారం ఇవ్వాలని లేదా 040–27853597 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.